



# ఆ నలుపు ముంగురులది కాదు

అత నంత నిశిరాత్రి కనపడతాడని ఆమె ఎప్పుడూ తలంచలా. నివ్వెరపోయింది.

'ఇదేనా రావటం. ఎక్కడనుంచి మధూ!'

'ఇక్కడనుంచే...మీ నాన్నగారు నిద్ర పోతున్నారా?'

'నిద్రపోతున్నారులే...కూర్చో...తలుపు దగ్గరగా వేసివస్తా'

'......'

'నాలుగు రోజులనుంచీ కనబడటంలేదేం. మధూ! ఎంత దిగులుగా ఉందో తెలుసా?'

'వద్దామనుకున్నా...కాని...'

'నావలన ఎంతకష్టపడుతున్నావ్.'

'నీ వట్లా అనుకుంటావనే...'

'లేదులే......నా కేం తోచటంలేదు. మననుగురించి ఆలోచించుకుంటే దిగులుగా ఉంటుంది, మధూ! మన జీవితాలు నిరర్థకం కావలసినదేనా?'

'ఎప్పుడూ అదే ఆలోచించి గుండె చెరువు చేసుకుంటే ఏం లాభం జగదా! అనవసరంగా దిగులుపడతావేం.'

'నే నేం చేయను? తలచుకుంటే ఏదో యిదిగా ఉంటుంది.'

'కష్టాలకోర్చుకోవాలి జగదా! మనకు మంచిరోజులు రాకపోవు.'

'...మీ నాన్నగారు లేస్తారేమో?'

'లేవరులే...నాకేంతోచటంలేదు మధూ! బ్రతకటం దుస్సహంగా ఉంది. మా నాన్నగారికి తనమాటే తనది... నేనేమి అనలేకుండా ఉన్నా...చిన్నప్పటినుంచి తల్లీతండ్రీ ఆయనే గదా...కూర్చో మధూ!'

'జగదా! నాకేది సుఖమో తెలియదూ నీకు.'

'తెలియక కాదు మధూ! ఎంత సంతోషంగా ఉందామనుకుంటానో అంతవిచార మేస్తోంది. నన్ను నేను మోసపుచ్చుకోలేకుండా ఉన్నా.'

'నామాట వింటావా?'

'వినకేం మధూ!'

'అట్లాయితే నిద్రపో-ఎంత నీరసంగా ఉన్నావో.'

'మధూ! మధూ!-మనయిద్దరం చచ్చిపోతే.'

........నే వెళ్లాలి జగదా!'

* * *

'మధూ!...మధూ! మధూ:...మధూ.' అప్పుడప్పు డిలాకలవరిస్తూనే ఉంటుంది జగద:

నిద్రలేచేటప్పటికి చాలాప్రొద్దెక్కింది. మనోవ్యధచే పాలిపోయిన ముఖంమీద ముంగురులు వింత అందాన్ని పుట్టిస్తున్నాయి. ఆ గదిలో ప్రతివస్తునువంక బిక్కమొగ మేసుకు చూస్తోంది. ప్రతివస్తువు సానుభూతి తెలుపుతోంది ఆమెకు. ఆమెగుండెలచప్పుడు తప్ప గదంతా ప్రశాంతంగాఉంది. టేబిలుమీద పువ్వులు ఎండిపోయాయి......ఆలోచనలలో పడింది.......రోజంతా గడిచిపోయింది ఆమెకు తెలియకుండానే. కాసేపు ఆమె మనస్సు అగాధంలో పడి కొట్టుకుంటుంది. కాసేపు ఆకాశంలో విహారం చేస్తుంది. ఆమెలోని మధనకు షుమారు నాలుగైదేళ్లుంటాయి. ఆమెలోని సంతోషాన్ని, రక్తాన్ని పీల్చుకు పెరుగుతోంది. రాత్రిభోజనం అయాక జగద గదిలో కూర్చుంది. దూరంగా వినబడుతున్న సంగీతం ఆమె విచారానికితోడయింది. ఆమెతండ్రి లోపలికివచ్చాడు.

'ఏంచేస్తున్నావ్? జగదా!'

'ఏంలేదు...ఊరికేకూర్చున్నా.'

'నీరసంగా ఉన్నావేం. ఎప్పుడూ ఎదాలోభంగా ఉంటావేం. ఏదో ఆలోచిస్తూ కూర్చుంటావ్. జబ్బు చేస్తుందని చెప్పలా?'

'...........'

'నీ కెన్నో పెద్ద సంబంధాలు తీసుకొచ్చా. చేసుకోనంటావ్.'

'......'

'మధుమీదుంది నీమనస్సు. అత నేమంత స్థితిపరుడు? అతనితో స్నేహంచేయటం నీ ప్రతిష్టకు భంగంకాదూ?'

జగద తలఎత్తి తండ్రివంక చూచింది. ఆచూపులో దైన్యము, నిస్సహాయత ఉన్నాయి.

'.........చిన్నదానివి కాదుగదా! ఆ మాత్రం తెలీదు నీకు నీ శ్రేయస్సు నాది గాదూ:'

ఆమెను చూస్తే జాలివేస్తుంది. చేత్తో కొంగుపుచ్చుకుంది. కళ్లు అంచును పరీక్షిస్తున్నాయి. హృదయం జీవితాన్ని పరీక్షించుకుంటోంది.

'ఔన్నత్యానికి అణకువ ఎంత మంచి మార్గం! నిన్ను నీవు గౌరవించుకోవాలి, జగదా!

'...........'

'ఇది క్రొత్తగాదు అనేకసార్లు చెప్పా. నే చెప్పేది నీవు వింటేనే దానికి ఫలితం ఉంది.'

'నాకు నిద్రవస్తోంది. మీరుపోయి పడుకోండి నాన్నగారూ!'

'ఎప్పుడు అతన్నిగురించే ఆలోచిస్తావ్! ఎంత చిక్కిపోయావు.'

అశ్రుపూరితనయనాలకు చీరచెంగు అడ్డం పెట్టింది.

'అనవసరంగా నిన్ను బాధించి నీమనస్సు మారుద్దామని రాలా, జగదా! తెలివితక్కువవలన కష్టాలు పాలవుతావ్.'

'నాన్నగారు! నామనస్సు బాగాలేదండి. పడుకుంటా.'

'సరే పడుకో.'

పదకొండుగంట లయింది. మంచంమీద వెలకిలపడుకుంది జగద. కన్నీరు కాలువగట్టి కర్ణరంధ్రాల్లో ప్రవేశిస్తోంది. వీపుక్రింద విడిపోయిన కేశబంధం తడిసిపోతోంది. పన్రెండుగంటలయింది...ఒంటిగంటకూడా అవబో

తోంది...ప్రపంచమంతా అంధకారావృత మయింది. ఆమె మనస్సు విషాదావృత మయింది. కన్నీరు తుడుచుకోటానికి వీపుక్రింద నుంచి చీరచెంగు లాక్కునే ఓపిక లేదు...

* * *

గాలికి తలుపులు తెరచుకున్నాయి. మధు లోపలికి వచ్చాడు...అతనిమీదనుంచి వచ్చే గాలి ఆమెకు పరిచయమే...ఓపిక వచ్చింది. మంచంమీదనుంచి లేచింది.

'కంట తడిపెట్టుకుంటున్నావా? జగదా!'

ఖిన్నుడయాడు – మంచంమీద కూర్చున్నాడు.

'ఇంతవానలో వచ్చావా ? మధూ!' కొంగుతో తల తుడుస్తోంది.

'......'

'రెండు రోజులనుంచి కనబడటంలేదేం?'

'ఏంలేదు...ఎప్పుడు విచారంగా ఉంటావేం? నీ కింత వేదన పనికిరాదు జగదా!' దీనంగా అన్నాడు.

'నేనేంచేయను మధూ : అన్నది నీరసంగా.'

'నీ మనోవైభవాన్ని కప్పివేసే మేఘాలు అప్పుడప్పుడు వర్షిస్తాయి. నాలో దుఃఖము పొంగి పొరలుతుంది.'

పూజనీయమైన ఆమె ఆకృతిని ఆరాధించే జ్యోతుల్లాగా ఉన్నాయి అతని రెండు కళ్లూ.

'ఇటురా మధూ! దగ్గరగా కూర్చో–నాది తీరరాని కోర్కె.'

ఆమె కంటిలోని రక్తిమ మనోవ్యథకు చిహ్నం.

'నేనెంత చెప్పినా నెమ్మదిపడ్డ మనస్సు నీకు దుర్లభమవుతోంది, జగదా!'

'భరించలేని దుఃఖము మనది–మధూ!' క్రిందిపెదవి వణకుతోంది. అతని హృదయం తరుక్కుపోతోంది.

'మరిచిపో జగదా! సొంపులొలుకు వెన్నెలలో కూర్చొని అమృతప్రభలను వెదజల్లే నీ చిరునవ్వులు ఏమయాయి. నీ మనస్సు నిబ్బరం చేసుకోవాలి–ఎంత మారిపోయావ్. నిన్నుచూస్తే నాకేదో భయం వేస్తోంది జగదా!'

ఆమెకన్నులు నీరు క్రమ్మాయి.

'అహర్నిశలు నా మనస్సుకు శాంతి లేదు, మధూ! నామనస్సంక్షోభం ఎంత ప్రయత్నించినా తగ్గటంలా.'

వేగుచుక్కలా ప్రకాశించింది అతనిముఖం.

'మాట్లాడుతూ అట్లా చలిస్తావేం. నీ గొంతుక ఎలాబొంగురు పోయింది' శ్రావ్యమైన నీ కంఠం అలామారిందేం. నీ బిగ్గరగా మాట్లాడినమాట అపస్వరంతో పాడినపాట యిప్పుడు జగదా.'

రాగరేఖలా ఆమె నేత్రగోళాలమధ్య ఉండిఉండి కనబడే కాంతులతో అతనికి మంగళహారతు లిస్తోంది.

'మధూ! నేను శాంతంగా ఉంటాలే.'

'అనవసరంగా మథనపడుతున్నావు! చిన్న నిప్పును ఆర్పేయవచ్చుగాని పెద్దజ్వాలకాని స్తే మహానదులుగూడా ఆర్పేయ లేవు.'

'......'

'మధూ!......నీవు......వివాహం చేసుకుని భర్త లాగా ఉంటే ఎలాఉంటావో!'

దడదడకొట్టుకుంటున్నాయి అతనిగుండెలు. సూదిపడి నా చప్పుడు వినబడుతుంది ఆగదిలో.

'నామీద నీకు అనిర్వాచ్యానురాగం ఎప్పుడు కలిగిందో అప్పటినుంచి నీ హృదయకుహరంలో నివశిస్తున్నా. నా పంచప్రాణాలు నీ కొంగుముడిలో ఉన్నాయి. నీ ఆనందం కొరకు ఎలాగన్నా ఉపయోగించుకో జగదా!'

జాలివేసింది జగదకు. ఇద్దరు కౌగలించుకున్నారు. ప్రేమాంబుధిలో పునీతములయాయి వాళ్ల శరీరాలు.

'మధూ! నాకు ప్రపంచంలో కోర్కె లేదు. ఉన్నదేమో తీరనికోర్కె......క్షణభంగురమైన ప్రపంచంలోని సౌఖ్యాలకు ఆశ ఎందుకో నాకు. తలచుకుంటే సిగ్గువేస్తోంది. నా మనస్సుపడే మధన తలచుకుంటే నన్ను నేనే అసహ్యించుకుంటూ మధూ! నిజంగా తీర రాదు.'

'...........'

'నాకు బ్రతకాలని లేదు, మధూ! (అతని చేయి పట్టుకుంది) ఆశ అంతరించి పోతోంది.'

ఆమె మనోవైపరీత్యాన్ని చూచి మధు స్తబ్ధుడయాడు. నీరుతో నిండిన ఆమెకళ్లకు అతనిప్రతిచ్ఛాయే కనబడుతోంది.

'నీవు ఆడదానివి కనుకనే వట్టి బేలవై పోతున్నావ్. ఒర్పు లేని వారెంత నిర్భాగ్యులు, జగదా!'

అంత తీవ్రంగా అతనిమనస్సులోని తత్తర పాటు ఎప్పుడూ బయటపడలా.

'..........'

'నీవుపోయి పడుకో. చాలప్రొద్దు పోయిం ది....వెళుతున్నా'

వెళ్లలేక వెళ్లలేక వెళ్లాడు.

'మ...'ఆగమందామనుకుంది. పెదవులు అదిరాయి. మాట తడబడింది. కన్నులు నీరు క్రమ్మాయి

* * *

షుమారు పండ్రెండుగంట లయింది. ఇ వాళ్ల మధు యింకారాలేదు. వానకురుస్తోంది.

ప్రేమించిన వ్యక్తికి ఆడుది తన సర్వస్వం ధారపోస్తుంది. అతనికోసం తన పరువుప్రతిష్టలు సంఘానికి బలియిస్తుంది—అనేకం త్యజిస్తుంది....జగదమనస్సు స్మృతిమించి రాగానపడింది. ఒకవైపు తండ్రిమీద వాత్సల్యం-వేరొకవైపు మధుమీద అనురాగం. రెంటికి సంధికుదర్చటం ఆమెకు తలమించినపని-దేవుని చేతుల్లోఉంది- ఒకదానికొరకు రెండవదాన్ని త్యజించటం ఆమెకు చేతగానిపని.

* * *

రాత్రి చాలాప్రొద్దు పోయింది. వానకురిసి వెలిసింది. తోటలోని చెట్లన్ని కన్నీరు కారుస్తున్నాయి. అందులో నడుస్తుంటే అయోమయంగాఉంది మధుకి. అంతర్యంలో ఏదో బాధపుట్టింది. వానలో బాగా తడిశాడు. వికృతంగా మారాడు. అతన్నిచూచి నక్షత్రాలు వణకుతున్నాయి. చంద్రుడు మేఘాల చాటున దాక్కున్నాడు.... మెల్లగా గదిలోకి వెళ్ళాడు-మంచందగ్గరకు. జగద మంచంమీద పడుకొనుంది. తేజోమయమై విరాజిల్లే ఆమె వదనం కాంతి విహీనమై, రక్తవిహీనమై, జీవరహితమై ఉంది......నెమ్మదిగా కదిలించాడు...బాగా కదిలించాడు ... ముఖానికి నల్లటిముంగురులు అడ్డంపడ్డాయని సవరించబోయాడు......ఆ న లు పు ముం గు రు ల ది కాదు...

అతనిగ్రుడ్లు అట్లాగే నిలిచిపోయాయి.

నెమ్మదిగా ముఖంమీద గుడ్డకప్పాడు. జిగిబిగిగా పడిన ఆమె వెంట్రుకలను సవరించి సరిగా పరుండజేశాడు:—వెర్రిగా - గదంతా - చూచాడు....బయటికి వచ్చి తలుపు నెమ్మదిగా వేశాడు.

* * *

అతనిలో వాన తుపాను చెలరేగింది. అందులో ఎక్కడికి కొట్టుకెళ్లాడో...?

—కూచిభొట్ల గోపాలకృష్ణమూర్తి, బి. ఏ.